క్లుప్తంగా

ఎమ్మెల్యే కోవ లక్ష్మి హౌజ్‌ అరెస్ట్‌



నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌: ఆశ్రమ వసతి గృహం విద్యార్థిని శైలజ మృతి చెందడంతో పోలీసులు ఎమ్మెల్యే కోవ లక్ష్మిని జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద హౌజ్‌ అరెస్టు చేశారు. విద్యార్థిని మృతి చెందడంతో బీఆర్‌ఎస్‌ శ్రేణులతో కలిసి వాంకిడి వెళ్లేందుకు సిద్ధమైన కోవ లక్ష్మిని డీఎస్పీ కరుణాకర్, సీఐ బుద్దే రవీందర్‌ ఆధ్వర్యంలో సోమవారం అర్ధరాత్రి వరకు పోలీసులు ఎమ్మెల్యేను ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. పోలీసుల చర్యను ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మంగళవారం పోలీసులు అనుమతించడంతో వాంకిడి మండలం ధాబా గ్రామంలో మృతురాలి కుటుంబసభ్యులను ఆమె పరామర్శించారు. ఆమె వెంట సింగిల్‌విండో చైర్మన్‌ అలిబిన్‌ అహ్మద్, బీఆర్‌ఎస్‌ నాయకులు అహ్మద్, రవీందర్, నిసార్, బుర్సపోచన్న, నాయకులు ఉన్నారు.

నాయకుల ముందస్తు అరెస్టు

రెబ్బెన: వాంకిడిలోని గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని విద్యార్థిని శైలజ చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన నేపథ్యంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మిని పోలీసులు ముందస్తుగా హౌస్‌ అరెస్టు చేశారు. విషయం తెలుసుకున్న రెబ్బెన మండల బీఆర్‌ఎస్‌ నాయకులు ఎమ్మెల్యే నివాసానికి తరలివెళ్లుండగా పోలీసులు అడ్డుకుని అరెస్టు చేసి కాగజ్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పీఏసీఎస్‌ చైర్మన్‌ కార్నాథం సంజీవ్‌కుమార్, వైస్‌ చైర్మన్‌ రంగు మహేశ్‌గౌడ్, నాయకులు శ్రీధర్, మధునయ్య, రాజేశ్వర్‌రావు, దుర్గారావు, శంకరమ్మ, రాజేశ్‌ తదితరులు ఉన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు

మండలానికి చెందిన బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి రెబ్బెన పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. వాంకిడిలో విద్యార్థిని శైలజ మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించడానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృష్ణకుమారితో పాటు పలువురు సిద్ధం కాగా పోలీసులు వారిని ముందస్తుగా అరెస్టు చేశారు.

శిక్షకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ అందించేందుకు శిక్షకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోలేటి, మాదారం టౌన్‌షిప్‌లలో సేవా సమితి ఆధ్వర్యంలో అందజేస్తున్న బ్యూటీషియన్, ఫ్యాషన్‌ డిజైనింగ్, డీటీపీ, స్పోకెన్‌ ఇంగ్లిష్, యోగా కోర్సుల్లో అభ్యర్థులకు శిక్షణ అందించేందుకు ఆసక్తి గల అభ్యర్థులు డిసెంబర్‌ 2వ తేదీ లోగా దరఖాస్తులను జీఎం కార్యాలయంలోని పర్సనల్‌ డిపార్టుమెంట్‌లో సేవా సమితి కోర్డినేటర్‌కు అందజేయాలని సూచించారు. పూర్తి వివరాలకు 99512 14116 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

'ఉపాధి' పనులు ప్రారంభం

లింగాపూర్‌: ప్రజాపాలన ప్రజావిజయోత్సవాల్లో భాగంగా మండలంలోని పిట్టగూడ గ్రామపంచాయతీలో మంగళవారం జాతీయ ఉపాధిహామీ పనులతో పాటు ఐకేపీ ద్వారా స్వయం సహాయక సంఘాలకు మంజూరైనా కోళ్ల ఫారం షెడ్‌ను జైనూర్‌ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ విశ్వనాథ్‌ ప్రారంభించారు. ఏపీవో చంద్రయ్య మాట్లాడుతూ మండలంలోని 14 గ్రామపంచాయతీలలో ఉపాధిహామీలో గుర్తించిన కొత్త పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. పిట్టగూడ జీపీలో మంజూరైనా కోళ్ల ఫారం షెడ్‌లకు సంబంధించి రూ.3 లక్షలు ఉపాధిహామీ నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఎంపీడీవో రామేశ్వర్, కాంగ్రెస్‌ పార్టీ మండలాధ్యక్షుడు లోకేందర్‌ పాల్గొన్నారు.

క్రీడాకారులకు విస్తృత ఉద్యోగావకాశాలు

ఆసిఫాబాద్‌రూరల్‌: క్రీడాకారులకు స్పోర్ట్స్‌ కోటాలో విస్తృతమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని డీఈవో యాదయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మంగళవారం ఎస్జీఎఫ్‌ ఆధ్వర్యంలో బాలబాలికల అండర్‌- 14, 17 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్‌ జిల్లాస్థాయి పోటీలను ప్రా రంభించారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టమైన క్రీడలో ప్రావీణ్యం సంపాదించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రా ణించాలన్నారు. జిల్లా నుంచి 200 మంది క్రీడాకారులు హాజరు కాగా, ప్రతిభ చూపిన 64 మంది జోనల్‌స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 28న బెల్లంపల్లిలో నిర్వహించే జోనల్‌స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, ప్రిన్సిపాల్‌ యాదగిరి, డీఎస్‌వో మీనారెడ్డి, అథ్లెటిక్స్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్, కోచ్‌లు వి ద్యాసాగర్, అరవింద్, పీడీ, పీఈటీలు లక్ష్మి, శారద, జ్ఞానేశ్వర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

- ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో వేడుకలు
- అంబేద్కర్‌ చిత్రపటాలకు నివాళులర్పించిన నాయకులు



బెజ్జూర్‌: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు



పెంచికల్‌పేట్‌: ఎల్కపల్లిలో కార్మికులను సన్మానిస్తున్న అధికారులు



లింగాపూర్‌: అంబేద్కర్‌ విగ్రహానికి పూలమాల వేస్తున్న విశ్వనాథ్‌



ఆసిఫాబాద్‌అర్బన్‌: అంబేద్కర్‌ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



ఆసిఫాబాద్‌రూరల్‌: జన్కాపూర్‌ పాఠశాలలో..



కెరమెరి: ఇందాపూర్‌ పాఠశాలలో..



కౌటాల: నివాళులర్పిస్తున్న అధికారులు



ఉద్యోగులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న శ్రీనివాస్‌

పెంచికల్‌పేట్‌: ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ బడుల్లో ప్రార్థన సమయంలో రాజ్యాంగ ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ ప్రతిజ్ఞ చేశారు. పంచాయతీ కార్యాలయాల్లో ఉత్తమ పారిశుధ్య కార్మికుడిని, వన సేవక్, ఉత్తమ ఉపాధి కూలీని అధికారులు సన్మానించారు. మండల ప్రత్యేక అధికారి ఈఈ ప్రభాకర్‌రావు, తహసీల్దార్‌ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో అల్బర్ట్, ఏపీవో సతీశ్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్‌: మండల కేంద్రంలోని కరుణ బుద్ధ విహార్‌ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జైనూర్‌ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ కుడ్మేతా విశ్వనాథ్, లోకేందర్‌ జాదవ్, నాయకులు పాల్గొన్నారు.

బెజ్జూర్‌: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో గౌరీశంకర్, ఏపీవో ఎగిరి రాజన్న, ఏపీఎం మోహన్‌లాల్, గ్రామ కార్యదర్శి తుకారాం, జిల్లా ఐకేపీ అధ్యక్షురాలు శ్రీదేవి, ఐకేపీ సీసీలు భద్రయ్య, పద్మ, ఫీల్డ్‌ అసిస్టెంట్‌ రవికుమార్, బెజ్జూర్‌ బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు వర్ధన్, యూత్‌ అధ్యక్షుడు హకీమ్, నాయకులు జావిద్‌ అలీ, సామల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్‌: భారత రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ రూపకల్పన బీఆర్‌ అంబేద్కర్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నార్‌ రమేశ్, నాయకులు గాజుల జక్కయ్య, వైరాగడె మారుతీపటేల్, నాగోసె శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎం హెల్ప్‌లైన్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో..

భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రతిఒక్క పౌరుడి బాధ్యత అని ఎంఎం హెల్ప్‌లైన్‌ ఫౌండేషన్‌ అధ్యక్షుడు ఎండీ అహ్మద్‌ అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో ఎంఎం హెల్ప్‌లైన్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్‌ అంబేద్కర్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సభ్యులు జాకీర్‌హుస్సేన్, పవన్, మన్సూర్, ముజాహిద్, గౌస్‌ఖాన్, సమీర్‌ఖాన్, మథిన్, తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్‌: భారత రాజ్యాంగ దినోత్సవం మంగళవారం జిల్లా కేంద్రంలోని బా లుర, బాలికల ఉన్నత పాఠశాలలో అంబేద్కర్‌ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఎంఈవో సుభాష్‌ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యున్నత ప్రజాస్వామ్య రాజ్యాంగమనదేని, రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

చింతలమానెపల్లి: మండలంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలలో కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంబేద్కర్‌ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. నూతనంగా ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానించారు.

కెరమెరి: మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రార్థనా సమయంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈవో ఆడే ప్రకాశ్, ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్‌ దత్తు ప్రసాద్‌ తదితరులు ఉన్నారు.

కౌటాల: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం భారత రాజ్యాంగ 75వ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని కౌటాల ప్రాథమిక పాఠశాలలో అంబేద్కర్‌ చిత్ర పటానికి ఎంఈవో గావుడే హన్మంతు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కౌటాల భారతీ విద్యా మందిర్‌ పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కరస్పాండెంట్‌ దుర్గం గోపాల్, ఉపాధ్యాయులు సందీప్, గులాబ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగం ఎంతో కీలకమైనదని బెల్లంపల్లి ఏరియా జనరల్‌ మేనేజర్‌ శ్రీనివాస్‌ అన్నారు. మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ నాయకులు బయ్య మొగిలి, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఏరియా ఇంజనీరు భీంరావు జాడే, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌ కుమార్‌ బెహెరా, పర్సనల్‌ మేనేజర్‌ తిరుపతి, సీనియర్‌ పర్సనల్‌ అధికారి ప్రశాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్‌: మండల కేంద్రంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను అంబేద్కర్‌ అసోసియేషన్‌ నాయకులు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వసతుల కల్పనకు చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే

ఆసిఫాబాద్‌: జిల్లాలో వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అన్నారు. అస్పిరేషనల్‌ జిల్లా కార్యకలాపాల్లో భాగంగా మంగళవారం న్యూఢిల్లీ నుంచి కేంద్ర ప్రభారి రజత్‌కుమార్‌ సైని వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే మాట్లాడుతూ అస్పిరేషనల్‌ బ్లాక్‌ కింద కేంద్ర ప్రభుత్వ నిధులతో గిరిజన ప్రాంతాలోని పాఠశాలలకు అదనపు గదుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో గీజర్ల ఏర్పాటు, మిషన్‌ భగీరథ పథకం ద్వారా శుద్ధజలం కోసం ఆర్‌వో ప్లాంట్లు, ఏజెన్సీలో వైద్యం కోసం వెంటిలేటర్‌తో కూడిన అంబులెన్స్‌ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కాగజ్‌నగర్‌లో ఎనిమల్‌ బర్త్‌ సెంటర్‌ ప్రారంభించామని పేర్కొన్నారు. డీఆర్‌డీవో దత్తారావు, జెడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ, సంపూర్ణ అభియాన్‌ జిల్లా కోఆర్డినేటర్‌ మనివేలు పాల్గొన్నారు.

'అత్యున్నత రాజ్యాంగం మనదే'

ఆసిఫాబాద్‌: ప్రపంచంలోనే అత్యున్నత రాజ్యాంగం మనదేనని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాగజ్‌నగర్‌ మండలంలోని అంకుసాపూర్‌ గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి ఉపాధి భరోసా, ఉద్యానవన, వన మహోత్సవం, జల నిధి, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన వంటి వివిధ పనులు, 80 అంగన్‌వాడీ కేంద్రాలు, 30 గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాల పనులకు ఉపాధిహామీ పథకంలో రూ.37 కోట్లు మంజూరు చేశామన్నారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, సబ్‌కలెక్టర్‌ శ్రద్ధా శుక్లా, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం, తహసీల్దార్‌ కిరణ్‌ కుమార్, ఎంపీడీవో రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ

చింతలమానెపల్లి: బాబాపూర్‌ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం తహసీల్దార్‌ మునావర్‌ షరీఫ్‌ జిల్లా కలెక్టర్‌ ఆదేశాల మేరకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, వసతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు సమస్యలను విద్యార్థులు తహసీల్దార్‌ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం వంటగదిని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనశాల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. సీలింగ్‌ ఫ్యాన్‌లకు మరమ్మతులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ప్రధానోపాధ్యాయుడు అశోక్, ఆర్‌ఐ జాఫర్‌ తదితరులు ఉన్నారు.

'శైలజ మృతికి ప్రభుత్వానిదే బాధ్యత'



బెజ్జూర్‌: విద్యార్థినికి నివాళులర్పిస్తున్న నాయకులు

కౌటాల: హాస్టల్‌లో చదువుతూ ఫుడ్‌పాయిజన్‌ కారణంగా మృతి చెందిన విద్యార్థిని శైలజ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని మాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మాలి సంఘం భవనంలో మాట్లాడారు. అధికార యంత్రాంగం, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగానే శైలజ మృతి చెందినట్లు ఆరోపించారు. బాధిత కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. మృతికి నిరసనగా ప్రకటించిన నేటి విద్యాసంస్థల బంద్‌కు అందరు సహకరించాలని కోరారు. నాయకులు నాందేవ్, ముక్తేశ్వర్, మోర్లె పాండురంగ్, వెంకటి, సంతోష్, భీంరావు తదితరులు పాల్గొన్నారు.

మాలి సంఘం ఆధ్వర్యంలో ధర్నా

కెరమెరి: వాంకిడి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఫుడ్‌ పాయిజన్‌ జరిగి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ బాలిక మృతి చెందగా మంగళవారం మాలి సంఘం ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రధాన రోడ్డుపై ధర్నా చేశారు. మాలి సంఘం మండలాధ్యక్షుడు కావ్‌డే తుల్సిరాం, డివిజన్‌ ప్రధాన కార్యదర్శి బాలాజి, మాజీ ఎంపీపీ పెందోర్‌ మోతీరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పత బాయి మాట్లాడుతూ విద్యార్థిని శైలజ మృతికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. బాధిత కుటుంబానికి రూ. 50లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. నాయకులు సుభాష్, తిరుపతి, జగన్నాథ్, తుకారాం, భరత్, ఉత్తం తదితరులు ఉన్నారు.

'శైలజ కుటుంబాన్ని ఆదుకోవాలి'

బెజ్జూర్‌: శైలజ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని ఆదివాసీ నాయకుడు పోల్క వెంకటేష్‌ డిమాండ్‌ చేశారు. మండల కేంద్రంలోని గాంధీ చౌక్‌ నుంచి బస్టాండ్‌ ఏరియా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నాయకులు తిరుపతి, జావిద్‌ అలీ, రామకృష్ణ, అశోక్, శ్రీవర్ధన్, సునీల్, రాకేష్, పురుషోత్తం, యువకులు పాల్గొన్నారు.

రాత్రివేళల్లో సాధన చేసుకునేలా సౌకర్యాలు కల్పించాలి



పనులు పరిశీలిస్తున్న జీఎం శ్రీనివాస్‌

రెబ్బెన: స్టేడియంలో రాత్రివేళల్లోనూ క్రీడాకారులు సాధన చేసుకునేలా సౌకర్యాలు కల్పించాలని బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్‌ అన్నారు. డబ్ల్యూపీఎస్‌ అండ్‌ జీఏ 91వ వార్షిక క్రీడల్లో భాగంగా గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో జరుగనున్న కంపెనీ లెవల్‌ క్రికెట్‌ పోటీల నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. స్టేడియంలో నూతనంగా నిర్మిస్తున్న క్రికెట్‌ పిచ్‌ పనులను పరిశీలించారు. జీఎం మాట్లాడుతూ డిసెంబర్‌లో నిర్వహించనున్న కంపెనీ లెవల్‌ క్రికెట్‌ పోటీల కోసం స్టేడియాన్ని సిద్ధం చేయాలని ఏరియా అధికారులకు సూచించారు. చిన్నారుల కోసం ఏర్పాటు చేస్తున్న మినీ పార్కు పరికరాలను పరిశీలించారు. ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఏరియా ఇంజనీరు భీంరావు జాడే, సివిల్‌ ఎస్‌ఈ మదీనా బాషా, తిరుపతి, ప్రశాంత్, స్పోర్ట్స్‌ కోఆర్డినేటర్‌ కిరణ్‌ తదితరులు పాల్గొన్నారు.

పీఎంఈ సెంటర్‌లో ఎక్స్‌రే ప్లాంట్‌ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న మల్రాజు శ్రీనివాస్‌రావు

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని పీరియాడికల్‌ మెడికల్‌ ఎగ్జామినేషన్‌ సెంటర్‌లో ఎక్స్‌రే సెంటర్‌ను ఏర్పాటు చేయాలని టీబీజీకేఎస్‌ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు డిమాండ్‌ చేశారు. మంగళవారం పీఎంఈ సెంటర్‌ను సందర్శించిన ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం కార్మికులకు అందుబాటులోనే మెడికల్‌ టెస్టులు నిర్వహించేలా సెంటర్‌ను గోలేటిలో ఏర్పాటు చేశారన్నారు. గత ఆరు నెలలుగా పీఎంఈ సెంటర్‌లో ఎక్స్‌రే ప్లాంటు పని చేయడంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్మికులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలకు అవసరమైన వినికిడి పరీక్షలు నిర్వహించే మిషన్‌ లేకపోవడంతో పరీక్షల కోసం కార్మికులను అంబులెన్సులో బెల్లంపల్లికి తీసుకెళ్లి అక్కడ టెస్టులు చేయించి తీసుకువస్తున్నారన్నారు. ఉదయం పూట అల్పాహారం చేయకుండా వైద్యపరీక్షల కోసం వస్తున్న కార్మికులు సాయంత్రం 6 గంటల వరకు హాస్పిటల్‌లోనే ఉండాల్సి వస్తోందన్నారు. గతంలో అనేకసార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పీఎంఈ సెంటర్‌లో, గోలేటి డిస్పెన్సరీలో మంచినీటి సౌకర్యాన్ని ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదన్నారు. వెంటనే పీఎంఈ సెంటర్‌లో ఎక్స్‌రే మిషన్, ఆడియో మిషన్, మంచినీటి సౌకర్యాలను ఏర్పాటు చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సెంట్రల్‌ కమిటీ నాయకులు ఓరం కిరణ్, సమ్మయ్య, ఏరియా నాయకులు అనుమాండ్ల సత్యనారాయణ, ఖైరిగూడ అసిస్టెంట్‌ పిట్‌ కార్యదర్శి మారిన చందర్‌లు పాల్గొన్నారు.

ఎకనామిక్స్‌ అధ్యాపకుడిగా ఎంపిక



తల్లిదండ్రులు, అన్నతో సాయికృష్ణ

పెంచికల్‌పేట్‌: పెంచికల్‌పేట్‌ గ్రామానికి చెందిన చిందం శకుంతల -జనార్ధన్‌ల కుమారుడు చిందం సాయికృష్ణ సోమవారం టీజీపీఎస్సీ ప్రకటించిన జూనియర్‌ లెక్చరర్‌ ఫలితాల్లో ఎకనామిక్స్‌ అధ్యాపకుడిగా ఎంపికయ్యాడు. నిరుపేద కుటుంబానికి చెందిన సాయికృష్ణ తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పెంచికల్‌పేట్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి, నార్నూర్‌లో ఇంటర్మీడియట్, హైదరాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ, ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ పూర్తి చేసిన సాయికృష్ణ ఇటీవల ఏఆర్‌ కానిస్టేబుల్‌గా ఎంపికై వికారాబాద్‌లో శిక్షణ సైతం పూర్తి చేశాడు. ప్రభుత్వ బడుల్లో చదివిన పెద్ద కొడుకు ఇండియన్‌ ఆర్మీకి ఎంపిక కాగా చిన్న కొడుకు లెక్చరర్‌గా ఉద్యోగం సాధించడంతో తల్లిదండ్రులు సంతోషంలో మునిగిపోయారు. ఉద్యోగం సాధించిన సాయికృష్ణను గ్రామస్తులు అభినందించారు.

పంచాయతీ భవనానికి భూమిపూజ

కెరమెరి: మండలంలోని ఇందాపూర్‌ గ్రామంలో గ్రామ పంచాయతీ భవనానికి మంగళవారం ఎంపీడీవో అంజద్‌పాషా భూమిపూజ చేశారు. రూ.20 లక్షల నిధులతో నిర్మాణం చేపట్టనున్న భవన నిర్మాణాన్ని ఆరు నెలల్లో పూర్తి చేయాలని ఎంపీడీవో సూచించారు. గతంలో భవనాలు లేని మండలాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా ఇటీవల ఇక్కడ పంచాయతీ భవనానికి మంజూరు చేసిందన్నారు.

సంక్షిప్త వార్తలు

నైపుణ్యాలు పెంచడమే లక్ష్యం

ఆసిఫాబాద్‌రూరల్‌: జిల్లాలోని ఒకేషనల్‌ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలు పెంచడమే ఆన్‌ ద జాబ్‌ ట్రెయినీ(వృత్తిపై శిక్షణ) లక్ష్యమని డీఈఐవో కళ్యాణి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల విద్యార్థులతో కలిసి మంగళవారం ఓజేటీ శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఒకేషనల్‌ విద్యార్థులు నేర్చుకునే అంశాలు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ రాందాస్, అధ్యాపకులు సతీశ్, రవికిరణ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నాయక్‌ కుటుంబసభ్యులకు పరామర్శ

జైనూర్‌: రాంనగర్‌ నాయక్‌ పవార్‌ భీంరావ్‌ మరణం బంజారా సమాజానికి తీరని లోటని బోథ్‌ నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే రాథోడ్‌ బాపురావు అన్నారు. మంగళవారం పలువురు నాయక్‌లతో కలిసి నాయక్‌ కుటుంబాన్ని పరామర్శించారు. రాథోడ్‌ భీంరావు నాయక్, కృష్ణనాయక్, రాథోడ్‌ రామేశ్వర్, బాలు యాదవ్‌ తదితరులు ఉన్నారు.

నూతన మార్కెట్‌ కమిటీ చైర్మన్‌కు సన్మానం

జైనూర్‌: మండల కేంద్రంలోని మండల పరిషత్‌ కార్యాలయంలో నూతన మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ కుడ్మేత విశ్వనాథ్‌ను శాలువా కప్పి అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ కుడ్మేత విశ్వనాథ్‌ మాట్లాడుతూ రైతులను దళారులు, వ్యాపారులు మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్‌ రెడ్డి, మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌లు మండాడి లింగు, ఆడ రాజ్‌కుమార్, ఎంపీవో మోహన్, ఏపీవో నగేశ్, సూపరింటెండెంట్‌ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

తోటి కార్మికునికి ఆర్థికసాయం

జైనూర్‌: తోటి కార్మికులకు సహాయం అందించడమే పంచాయతీ కార్మికుల సంఘం ప్రధాన లక్ష్యమని పంచాయతీ కార్మికుల సంఘం నాయకుడు మడావి కోద్దు అన్నారు. మంగళవారం మండలంలోని మార్లవాయిలో కారోబారి సోనేరావు భార్య ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించి రూ.5000ల ఆర్థికసాయం అందించారు.

విశ్రాంత ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలి

ఆసిఫాబాద్‌అర్బన్‌: విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్‌లో తగ్గింపు నుంచి మినహాయింపు ఇవ్వాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కర్నాగౌడ్‌ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఖజానా అధికారి భానుమతికి వినతిపత్రం అందజేశారు.

ఆదివాసీ నేతకు ఘన నివాళి

చింతలమానెపల్లి: తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా సేవలందించిన ఆదివాసీ ఉద్యమ నాయకుడు ఉయికె సంజీవ్‌కు ఆదివాసీ నాయకులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. మండలకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పుష్పాంజలి ఘటించారు. ఆయన ఆదివాసీల హక్కుల సాధనకు, ఐక్యతకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆదివాసీ కొలవార్‌ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గాట్ల శంకర్, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ ప్రసాద్, తుడుందెబ్బ జిల్లా ప్రచార కార్యదర్శి ఫణిందర్, తుడుందెబ్బ జిల్లా సంయుక్త ప్రచార కార్యదర్శి బాపూరావు, ఆదివాసీ నాయకులు శంకర్, వెంకన్న, కిష్టయ్య, భగవాన్, పాపయ్య, రాజయ్య, హన్మంతు, గోపాల్, లచ్చయ్య, ఆర్జయ్య, మహేశ్‌లు పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆదివాసీ ఉద్యమ నేత ఉయిక సంజీవ్‌ చిత్రపటానికి మంగళవారం కౌటాలలో పూలమాలలు వేసి మన్నెవార్‌ సేవా సంఘం నాయకులు నివాళులర్పించారు. మన్నెవార్‌ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు డబ్బా బాపు మాట్లాడుతూ తుడుం దెబ్బ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఉండి గత 30 ఏళ్లుగా సేవలు అందించిన సంజీవ్‌ మృతి చెందడం ఆదివాసీ సమాజానికి తీరని లోటు అన్నారు. బాపురావు, కుర్మ రాజు, నగేశ్, హన్మంతు, సిద్ధయ్య, ఉమేశ్, సత్తయ్య, వినోద్‌ తదితరులు పాల్గొన్నారు.

సుకన్య పొదుపు ఖాతాతో బంగారు భవిష్యత్తు

ఆసిఫాబాద్‌అర్బన్‌: సుకన్య పొదుపు ఖాతాలతో ఆడపిల్లలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఆర్థిక నిపుణులు జాదవ్‌ సాగర్‌ అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పని చేస్తున్న జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో.. బేటీ పడావో పథకంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్‌లో తల్లిదండ్రులకు సుకన్య సమృద్ధి యోజన పొదుపు ఖాతా వినియోగంపై అవగాహన కల్పించడతో పాటు ఖాతాలు తెరిపించారు. జెండర్‌ స్పెషలిస్టు రాణి, అధికారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్‌ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: ఎస్‌జీఎఫ్‌ రాష్ట్రస్థాయి క్రికెట్‌ పోటీలకు కౌటాల మయూరి విద్యాలయం విద్యార్థి హర్షిత్‌ రెడ్డి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్‌ శగంటి యాదగిరి తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు. ఈ నెల 25న ఆదిలాబాద్‌లో జరిగిన జోనల్‌స్థాయి అండర్‌ 17 బాలుర క్రికెట్‌ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు సంతోష్, పీఈటీ నరేందర్, తదితరులు పాల్గొన్నారు.